
సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 16 । మే । 2023



ఉపాధ్యాయుల బది'లీలలు'

ఉపాధ్యాయుల బదిలీల్లో సంఘ నాయకుల వ్యవహారంపై టీచర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందరికీ ఐదేళ్ల విధానం తీసుకురావాలని కోరుతున్నారు. 8లో



హైపర్ టెన్షన్‌తో తంటా

హైపర్ టెన్షన్ అత్యంత ప్రమాదకరం. గుండె, మెదడు, నరాలు, కిడ్నీపై చెడు ప్రభావాన్ని చూపిస్తూ అనారోగ్యం బారిన పడేస్తోంది. 8లో



నేత్రపర్వంగా కల్యాణం

హనుమద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురవాయిగూడెం మద్ది ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని నేత్రపర్వంగా జరిపించారు. 8లో

న్యూస్‌రీల్

హిందూ ధర్మం మహోన్నతం



అనుగ్రహ భాషణం చేస్తున్న కమలానంద భారతీస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారతదేశ సనాతన ధర్మం చాలా విశిష్టమైందని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతులు, సంప్రదాయ పరంపరానుగత కమలానంద భారతీస్వామి అన్నారు. తాడేపల్లిగూడెంలోని చిన్నవంతెన శంకరమఠంలో చంద్రమౌళీశ్వర స్వామి ఆలయానికి సోమవారం విచ్చేశారు. ఆలయంలో జరుగుతున్న శిఖర గోపుర నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ సంప్రదాయానికి వారసులుగా ఉన్న భారతీయ గృహస్థ ధర్మంలో ఉన్నవారంతా అదృష్టవంతులని, వివాహ బంధం మరింత విశిష్టమైందని అన్నారు. ఓగేటి వండు, గరికపాటి బాపయ్య శర్మ, ఆదూరి కృష్ణ మోహన్, కొలచన భాస్కరశర్మ ఆయన వెంట ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సర్వం సిద్ధం



క్రీడా ప్రాంగణంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం నుంచి ప్రారంభమయ్యే కవురు శ్రీనివాస్ కప్ రాష్ట్రస్థాయి అండర్–17 బాలురు, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 550 మంది క్రీడాకారులు, కోచ్‌లు రానున్నారు. సోమవారం కడప, గుంటూరు, కర్నూలు, ప్రకాశం తదితర జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడా ప్రాంగణానికి చేరుకుని ప్రాక్టీస్ చేశారు. 19వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పోటీలు నిర్వహిస్తారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కన్వీనర్ మద్దాల వాసు తెలిపారు.

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

సాక్షి, భీమవరం: స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం వహించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ యూ.రవిప్రకాష్ అన్నారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఆయన సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి నిర్దేశిత గడువులోపు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 26 మంది బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందించారు. వాటిలో చీటింగ్ కేసులకు సంబంధించి 10, వరకట్న వేధింపుల కేసులు 12, ఆస్తి తగాదాలపై రెండు, ఇతర వేధింపులపై రెండు ఫిర్యాదులు ఉన్నాయి.

హెచ్‌ఆర్‌ఏ పెంపుపై హర్షం



కలెక్టర్‌కి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్జీఓ నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాలకు కూడా పాత జిల్లాలతో సమానంగా ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ)ను 12 నుంచి 16 శాతానికి పెంచడంపై హర్షిస్తూ సోమవారం రాష్ట్ర ఎన్జీఓ సంఘ ఉపాధ్యక్షుడు పెనుమర్తి శ్రీనివాసులు, జిల్లా నాయకులు వి.శోభన్‌కుమార్, కేవీఎస్‌కే రమేష్‌రెడ్డి, ఎన్.జగదీశ్వరరాజు, ఎం.సత్యనారాయణ సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. హెచ్‌ఆర్‌ఏ పెంపునకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని ఉద్యోగుల ద్వారా చేరువ చేయాలని కోరారు. జిల్లా విభజన తొలినాళ్లలో ఉన్న పరిస్థితులను అధిగమిస్తూ ఉద్యోగుల సహకారంతో జిల్లాకు ఒక రూపం తీసుకు వచ్చామన్నారు.

ప్రశాంతంగా ఈఏపీ సెట్ ప్రారంభం

తొలిరోజు 2,914 మంది హాజరు



తాడేపల్లిగూడెం వాసవీ కళాశాలలో విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ సోమవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. తొలిరోజు పరీక్షకు ఏలూరు జిల్లాలోని మూడు కేంద్రాల్లో 924 మందికి గాను 897 మంది హాజరయ్యాయి. వీరిలో ఉదయం సెషన్‌లో 462 మందికి 448 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 462 మందికి 449 మంది హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు కేంద్రాల్లో 2,088 మందికి 2,017 మంది హాజరయ్యారు. వీరిలో ఉదయం సెషన్‌లో 1,044 మందికి 1,007 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 1,044 మందికి 1010 మంది హాజరయ్యారు.



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాల వద్ద హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



ఏలూరులో రూమ్ నంబర్‌ను సరిచూసుకుంటున్న విద్యార్థులు

నిప్పుల కుంపటి



అలంపురం వద్ద నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి

ఏలూరు(మెట్రో): భానుడు ప్రతాపం చూపుతున్నాడు.. ప్రచండ గాలులతో విరుచుకుపడుతున్నాడు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఉదయం 10 గంటలు దాటితే అడుగు బయటపెట్టేందుకు భయపడుతున్నారు. సోమవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎండ 'మండే'

- ఉదయం నుంచే ఎండ తీవ్రత
- అత్యధిక ఉష్ణోగ్రతల నమోదు
- నిప్పులు కురిపిస్తున్నట్టు వడగాల్పులు
- మరో నాలుగు రోజులపాటు ఇదే పరిస్థితి
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

రోహిణీ కార్తెను మించి..

సాధారణంగా రోహిణీ కార్తెలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. అయితే ఈ ఏడాది వారం ముందుగానే ఎండలు మండిపోతున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు ఇదే ప్రభావం కనిపిస్తుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మోచా తుపాను మయన్మార్ వైపు వెళ్లడంతో మన ప్రాంతంలో ఎండలు పెరిగాయని అంటున్నారు. అలాగే వేడి గాలులు సైతం వీస్తాయని చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలంతా కనీస జాగ్రత్తలు తీసుకోవాలని, రానున్న రోజుల్లో గాలిలో తేమశాతం సైతం తగ్గి ఉక్కపోత పెరుగుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచిస్తున్నారు. ప్రయాణాలను సైతం వాయిదా వేసుకోవడం ఉత్తమమని అంటున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బకు లోనుకావడం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి అలసట, ఆయాసం వస్తుంటాయని అన్నారు.

మంగళవారం మరింతగా..

ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో 12 మండలాల్లో వేడిగాలులు వీచాయని, మంగళవారం 28 మండలాల్లోనూ వేడిగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నివారణ సంస్థ అధికారులు తెలిపారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో 3 మండలాల్లో వేడిగాలులు వీయగా మంగళవారం 11 మండలాల్లో వేడిగాలులు వీస్తాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉష్ణోగ్రతలు ఏ మేరకు పెరగవచ్చనే వివరాలు వెల్లడించారు.



విపత్తుల నివారణ సంస్థ ప్రకటించిన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

పశ్చిమగోదావరి జిల్లా

మండలం	సోమవారం	మంగళవారం
ఆచంట	42.7	42.8
ఆకివీడు	43.7	45.0
భీమవరం	42.7	43.8
ఇరగవరం	40.9	45.2
కాళ్ల	39.3	44.4
మొగల్తూరు	42.7	40.0
నరసాపురం	42.7	40.0
పాలకోడేరు	42.6	44.2
పాలకొల్లు	43.9	43.0
పెంటపాడు	42.8	45.5
పెనుగొండ	42.1	44.1
పెనుమంట్ర	43.3	44.1
పోడూరు	42.7	43.1
తాడేపల్లిగూడెం	42.7	45.3
తణుకు	43.9	45.5
ఉండి	42.5	44.8
వీరవాసరం	41.6	43.5
యలమంచిలి	42.2	42.5

ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారోత్సవం





వెలగపూడిలోని రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో సోమవారం శాసనమండలికి నూతనంగా ఎన్నికైన సభ్యులు (ఎమ్మెల్సీలు) కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ ప్రమాణ స్వీకారం చేశారు.

'సాక్షి' వేసవి శిక్షణలు ప్రశంసనీయం



చెస్‌లో మెలకువలు నేర్పుతున్న కిషోర్

సాక్షి, భీమవరం: ప్రజాసమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల ముందుకు తీసుకువెళ్లి పరిష్కరించడంతో పాటు సమాజహితమైన వేసవి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్న 'సాక్షి' మీడియా ప్రశంసనీయమైన పాత్ర పాత్ర పోషిస్తోందని భీమవరం హౌసింగ్‌బోర్డు కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సరిపిడకల రామారావు అన్నారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో హౌసింగ్‌బోర్డు కాలనీ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ సహకారంతో హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఆదిత్య కళావేదిక వద్ద మూడు రోజులుపాటు నిర్వహించే చెస్ వేసవి ఉచిత శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ తరగతులు క్రీడాకారులల్లో ఆసక్తి పెంచుతాయని, తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తోట భోగయ్య మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోకుండా మేధస్సును పెంచే చదరంగంలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. నిత్యం సమస్యల పరిష్కారానికి కృషిచేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి 'సాక్షి' చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ చదరంగం ద్వారా క్రీడాకారుల్లో మేధస్సు పెరిగి ఉన్నత విద్యాభ్యాసానికి దోహదపడుతుందన్నారు. ఇటీవల జిల్లాలో చెస్‌పై విద్యార్థుల్లో ఆసక్తి పెరిగిందన్నారు. అనంతరం ఆయన క్రీడాకారులకు చెస్‌లో మెలకువలు వివరించారు. హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ కార్యదర్శి జానపాటి మధుసూదనరావు, కె.బాల, మారిశెట్టి రామ్‌ప్రసాద్, అల్లు శ్రీనివాస్, మైలాపురి మురళి పాల్గొన్నారు.



చెస్ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రామారావు

17న చెస్ పోటీలు

'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెస్ వేసవి ఉచిత శిక్షణ తరగతుల్లో భాగంగా ఈనెల 17న హౌసింగ్ బోర్డు కాలనీలో చదరంగ పోటీలు నిర్వహిస్తారు. పోటీలకు ప్రవేశం ఉచితం. విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందిస్తామని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు.

నిర్ణీత సమయంలో అర్జీల పరిష్కారం

'స్పందన'లో కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారులకు సంతృప్తి కలిగేలా పరిష్కారం ఉండాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. మండల స్థాయి అధికారులు ఏ ఎండార్స్‌మెంట్ ఇస్తే అదే జిల్లాస్థాయి అధికారులు కూడా ఇస్తున్నారని కొంచెం సీరియస్‌గా దృష్టి పెట్టాలని ప్రతి అధికారి విధిగా క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచించారు. మండల స్థాయి అధికారులు దరఖాస్తులపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. స్పందనలో మత్స్యశాఖ, విద్యుత్ శాఖ, రెవెన్యూ భూ సమస్యలు, పౌర సరఫరాలు, పెన్షన్‌లు, మంచినీటి సమస్య, ఇరిగేషన్ శాఖ సమస్యలపై ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. మొత్తం 153 అర్జీలను స్వీకరించామని, త్వరితగతిన ఆయా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించాచరు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జిల్లా అధికారులు

అర్జీల్లో కొన్ని..

- అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన రాగు ప్రసాద్ అనే దివ్యాంగుడు తాను ఇంటర్ వరకు చదువుకున్నానని, ఉద్యోగం లేదా స్వయం ఉపాధికి రుణం ఇప్పించాలని కోరాడు.
- వీరవాసరం మండలం కొణితివాడకి చెందిన యరకరాజు సుబ్బరాజు నెలమూరులో రొయ్యల చెరువులపై 200 వరకు అక్రమ బోర్లు ఉన్నాయని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చాడు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ్యాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యుల ఆధ్వర్యంలో పానంగిపల్లి సత్యపవన్ కల్యాణ తంతు జరిపించారు. రెడ్డి రంగప్రసాదరావు కుటుంబసభ్యులు, తానంకి సత్యనారాయణ కుటుంబసభ్యులు ఉభయధారులుగా వ్యవహరించినట్టు ఈవో మానికల రాంబాబు తెలిపారు. సాయంత్రం రూపాదేవి శిష్యబృందంచే నృత్యప్రదర్శన నిర్వహించారు. చంద్రప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతిరాజు, దండు ధనరాజు, వాసవీ సాయినగేష్, బూరుగుపల్లి రవీంద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఎస్‌ఈబీ దాడులు

చింతలపూడి: చింతలపూడి ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో సోమవారం దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని మంకెనపల్లి, నాగిరెడ్డిగూడెం, పోతునూరు, కొత్తపల్లి తదితర గ్రామాల్లో దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో తోట సుందరరావును అరెస్టు చేసి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. భూక్యా కళ్యాణిని అరెస్టు చేసి 10 లీటర్ల నాటుసారా, బండారి సునీతను అరెస్టు చేసి 10 లీటర్ల నాటు సారా, కసగాని కోటేశ్వరరావును అరెస్టు చేసి 2 లీటర్ల సారా సీజ్ చేసినట్లు చెప్పారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం


ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 13వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రాంతాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ.పురుషోత్తమ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జీ.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 6,565 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 32 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ఏలూరులో 6 బెంచీలు, భీమవరంలో 5, కొవ్వూరులో 4, నరసాపురంలో 3, తణుకులో 3 తాడేపల్లిగూడెంలో 3, పాలకొల్లులో 1, నిడదవోలులో 2, జంగారెడ్డిగూడెంలో 1, చింతలపూడిలో 2, భీమడోలులో 1 ఉన్నాయన్నారు. 6,128 క్రిమినల్, 106 మోటార్ వాహన ప్రమాద కేసులు, 115 సివిల్ కేసులు రాజీ చేశామన్నారు.

హైపర్ టెన్షన్‌తో తంటా

- చిన్నవయసులోనే పలువురిలో బీపీ లక్షణాలు
- ఒత్తిడి, అనారోగ్యకర జీవనశైలితో ముప్పు
- నేడు ప్రపంచ హైపర్ టెన్షన్ డే



ఏలూరు టౌన్: సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యల్లో హైపర్ టెన్షన్ అత్యంత ప్రమాదకరమైనది. గుండె, మెదడు, నరాలు, కిడ్నీపై చెడు ప్రభావాన్ని చూపిస్తూ అనారోగ్యం బారిన పడేస్తోంది. ఒక్కోసారి పక్షవాతం, గుండెపోటు ఇతర తీవ్ర అనారోగ్యంతో ప్రాణాలకు హాని చేస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. నేడు హైపర్ టెన్షన్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

హైపర్ టెన్షన్‌తో తంటా

ఒక వ్యక్తి గుండె సాధారణ స్థితిలో బ్లడ్ ప్రెషర్ (బీపీ) 120/80గా పేర్కొంటారు. తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ పెద్ద వయస్సులో కొన్ని పరిస్థితుల్లో 140/90గా ఉన్నా సాధారణ స్థితిగానే నిర్ధారిస్తున్నారు. గుండెకు రక్తాన్ని పంపింగ్ చేయటం, గుండె కొట్టుకునే స్థితినే బ్లడ్ ప్రెషర్‌గా చెబుతారు. నేటి ఆధునిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులతో హైపర్ టెన్షన్ ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. హైపర్ టెన్షన్‌లో అసాధారణ రీతిలో 160/100, 170/110, 200/120 ఇలా బ్లడ్ ప్రెషర్‌తో ఆరోగ్య సమస్య ఏర్పడుతుంది. ఒక్కో సారి మెదడులోనూ, గుండెలోనూ నరాలు దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరతారు. పక్షవాతం, కిడ్నీ సమస్యలు, నరాల సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కరోనా విలయం అనంతరం మనిషి జీవన స్థితిగతులు మరింత జఠిలం అయ్యాయని అంటున్నారు. కరోనా అనంతరం యువతలో సైతం హైపర్ టెన్షన్ ప్రభావం అధికంగా ఉందనే అభిప్రాయం ఉంది. ఇటీవల 20 నుంచి 30 ఏళ్ళ లోపు యువత గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ సమస్యలతో మృత్యువాత పడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

హైపర్ టెన్షన్‌తో బాధపడే రోగులు ముఖ్యంగా ఆహార పదార్థాల్లో ఉప్పును తక్కువగా వినియోగించాలి. మసాలాలు, నిల్వ పచ్చళ్ళు, కారం తగ్గించాలి. ప్రతి రోజూ గంటపాటు సాధారణ వ్యాయామం, యోగా వంటివి చేయడం మంచిది. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి. మత్తు పదార్థాలు, ఆల్కహాల్, సిగరెట్ వంటి వాటికి దూరంగా ఉండాలి.

ఐదేళ్లలో జిల్లాలో హైపర్ టెన్షన్ బాధితులే		
2023లో	-	67,235
2022లో	-	62,947
2021లో	-	56,439
2020లో	-	50,406

హైపర్ టెన్షన్ లక్షణాలు:

- మెడ నరాలు లాగేస్తున్నట్లు ఉండటం
- కళ్లు తిరగడం
- ఆకస్మికంగా తూలిపోవడం
- తలపోటు తరుచూ రావడం
- ఒళ్ళంతా చెమటలు పట్టడం
- యూరిన్ తక్కువగా రావడం
- కాళ్ళు తిమిర్లు

గుండె, కిడ్నీ సమస్యలు



ప్రస్తుతం అత్యధిక శాతం హైపర్ టెన్షన్ సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ఇది గుండె సంబంధిత వ్యాధులకు దారి తీస్తుంది. చిన్న వయస్సులోనే ఈ సమస్య ఉత్పన్నమైతే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి. ప్రతి రోజూ వ్యాయామం చేయడం, ఆకుకూరలు, కూరగాయలు తినడం, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవడం మంచిది.

డాక్టర్ ఏ.హరికృష్ణ, నరాలు, మానసిక వైద్య నిపుణులు

పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది



యువతలో ఇటీవల హైపర్ టెన్షన్, ఆందోళన అధికంగా ఉంటుంది. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు, ఆల్కాహాల్, సిగరెట్, నిద్రలేమి, సెల్‌ఫోన్ వినియోగం, వీడియోగేమ్స్ వంటివి ఈ హైపర్ టెన్షన్‌కు దోహదం చేస్తున్నాయి. రక్తనాళాల్లో పగుళ్ళు ఏర్పడి వాటి వద్ద కొవ్వు పేరుకుపోతుంది. అనంతరం అవి గుండెకు ప్రయాణం చేసి ఎంబోలిక్ ఫినామినాగా మారి తీవ్ర అనారోగ్య సమస్యగా మారుతుంది. ఒత్తిడిని దూరం చేసుకోకపోతే పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. జీవనవిధానంలో మార్పు, చెడు వ్యసనాల నుంచి దూరంగా ఉండటం , ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ద్వారా దీని నుంచి బయట పడవచ్చు.

డాక్టర్ రవికుమార్, న్యూరో సర్జన్

పాతికేళ్ల తాగునీటి సమస్యకు పరిష్కారం

మాజీ మంత్రి కామినేని స్వగ్రామంలో పైపులైన్ ఏర్పాటు


పైపులైను పనులకు శంకుస్థాపన చేస్తున్న వరహాపట్నం సర్పంచ్ నాగమణి

కైకలూరు: ఆరోగ్యశాఖ మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ స్వగ్రామం వరహాపట్నం. చంద్రబాబు పాలనలో ఆయన ఓ వెలుగు వెలిగారు. గ్రామాభివృద్ధిలో మాత్రం వెనుకబడ్డారు. నేడు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదేశాలతో గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి రూ.4 లక్షలతో పైపులైను పనులను సోమవారం ప్రారంభించారు. గత పరిస్థితులను గమనిస్తే వరహాపట్నం శివారు బొల్లినంపాడు అగ్రహారంలో 100 కుటుంబాలు నివసిస్తున్నాయి. దాదాపు పాతికేళ్ళగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. కామినేని మంత్రిగా ఉన్నప్పుడు గ్రామానికి పైపులైను ఏర్పాటు చేయాలని అనేక సందర్భాల్లో ప్రజలు వేడుకున్నారు. మంత్రి హోదాలో ఉండి కూడా కాలయాపన చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సర్పంచ్ నాగమణి ఆధ్వర్యంలో పనులు ప్రారంభించడంపై గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఎంపీపీ అడవి కృష్ణ మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షలు, ఎంపీ నిధుల నుంచి రూ.2 లక్షల విడుదల చేశారు. దీంతో వరహాపట్నం గ్రామం నుంచి కిలోమీటర్నర దూరం వరకు నూతన పైప్‌లైను వేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుడు మారగాని గణపతి మాట్లాడుతూ ఊరికి తాగునీటి పైపులైను ఏర్పాటు చేయాలని అనేక సందర్భాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులను అడిగామన్నారు. ఇన్నాళ్లకు ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ నాగమణి, ఎంపీపీ గాంధీప్రసాద్, గ్రామ ప్రముఖుడు జయదేవ్‌కుమార్‌కు కృషి వల్ల తమ కల నెరవేరుతుందన్నారు.

సీఎం జగన్ నమ్మకాన్ని నిలబెడతా


మాట్లాడుతున్న క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు

కాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా క్షత్రియులకు, ప్రజలకు సేవలందిస్తానని క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. తన తండ్రి పాతపాటి సర్రాజు సేవలను గుర్తించి క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా సీఎం జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు అప్పగించారని గుర్తుచేసుకున్నారు. ఆయన మరణానంతరం కూడా మా కుటుంబానికి ప్రత్యేక స్థానం ఇచ్చి క్షత్రియులందరికీ సేవ చేసుకునే అవకాశాన్ని జగన్‌మోహన్ రెడ్డి కల్పించారన్నారు. తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ జగన్ మోహన్ రెడ్డి ఆశలకు అనుగుణంగా నడుస్తానని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి లాంటి మహోన్నత వ్యక్తి పాలనలో తాను కూడా పనిచేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటానని చెప్పారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ నెల 14న విజయవాడలో జరిగిన ప్రమాణ స్వీకారానికి తరలివచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫెడరేషన్ కప్‌కు ఎంపిక

ఏలూరు రూరల్: నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ హ్యామర్ త్రో పోటీల్లో పాల్గొనేందుకు ఏలూరుకు చెందిన వినీత్‌కుమార్ ఎంపికయ్యాడు. ఈ నెల 15 నుంచి రాంచీలో అథ్లెటిక్స్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా అథ్లెటిక్స్ ఆర్గనైజేషన్ నిర్వహించిన ఎంపిక పోటీల్లో వినీత్‌కుమార్ సత్తా చాటాడు. ఈ సందర్భంగా పలువురు వినీత్‌ను అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

సాక్షి, భీమవరం: రూరల్ మండలం దెయ్యాలతిప్పకు చెందిన రమాని కనకదుర్గ(51) అనుమానాస్పదంగా మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ చెప్పారు. కనకదుర్గ సోమవారం పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ బ్యాంకుకు వచ్చింది. వాంతులు, విరేచనాలతో పడిపోవడంతో 108లో ప్రభుత్వాసుపత్రిలో చేర్చి చికిత్స చేస్తుండగా మృతి చెందింది. కనకదుర్గ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

దళితుల జీవన విధానంపై టీడీపీ కుట్ర


కొవ్వలిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ పండుల రవీంద్రబాబు

దెందులూరు: కొవ్వలిలో దళితుల జీవన విధానాన్ని అడ్డుకునేందుకు టీడీపీ, అక్రమార్కులు కుట్ర పన్నారని హైకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి పెద్ద చెరువుపై రాద్ధాంతం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ పండుల రవీంద్రబాబు అన్నారు. సోమవారం కొవ్వలిలో ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1962 నుంచి కొవ్వలి గ్రామంలో వంద ఎకరాల పెద్ద చెరువును దళితులు ఒక పంట వేసుకుని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. రెండవ పంటకు ఆ చెరువుకు నీరు నింపి దాళ్వాకు సరఫరా చేస్తున్నారన్నారు. సాగుపై ఆధారపడి జీవిస్తున్న దళితులందరి ఏకాభిప్రాయ నిర్ణయంపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, తాను ఉన్నతాధికారులకు వివరించడంతో రెండో పంట సాగు చేశారన్నారు. కొవ్వలి గ్రామానికి చెందిన పిటిషనర్ గ్రామదీప్ దళితుల జీవన విధానానికి శాశ్వత అడ్డు కల్పించేలా తప్పుడు సమాచారాన్ని ఇచ్చి రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో చేపలు, రొయ్యల సాగుతోనే పర్యావరణం పూర్తిగా కలుషితమైందని, ఆ విషయాన్ని ఎందుకు హైకోర్టుకు చెప్పలేదని ప్రశ్నించారు. దళితుల జీవన విధానానికి అడ్డుపడుతున్న పిటిషనర్, టీడీపీ, అక్రమార్కులు ఏ వ్యాపారాలు చేస్తున్నారు ప్రభుత్వానికి ఎందుకు పన్ను కట్టడం లేదో, ఆ ఆదాయాన్ని ఎక్కడికెక్కడకు తరలిస్తున్నారో, ఎన్నాళ్ళ నుంచి ఈ అక్రమ వ్యవహారం జరుగుతుందన్న పూర్తి స్థాయిలో ఆధారాలతో నివేదిక సిద్ధం చేశామన్నారు. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు నివేదిక అందచేసి వారిపై విచారణ కోరతామన్నారు. దళితులు ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీతో ఆది నుంచి అండగా ఉన్నారని, భవిష్యత్తులో కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీతోనే కొనసాగుతారని చెప్పారు. సమావేశంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ కాటి సుధాకర్, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి గొల్ల వీరాస్వామి, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, గ్రామ సర్పంచ్ ఇంటేటి మధులత, నాయకులు ఇంటేటి గంగాధర్, కాటి అర్జున్, మురళి, వెంకటేశ్వరరావు, దళిత పెద్దలు, దళితులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరులో శ్రీనివాస లక్ష్మీ దుర్గ టింబర్ డిపో వెనుక భాగంలో అగ్ని ప్రమాదం జరిగింది. సిగరెట్ కాల్చి ఆర్పకుండా పడవేయడం వల్ల ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని ఫైర్ అధికారులు తెలిపారు. ఫైర్ ఇంజిన్ వచ్చే లోపే స్థానికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకుని మంటలను అదుపుచేశారు. లక్ష్మీనారాయణ ఫౌండేషన్‌కు చెందిన వాటర్ ట్యాంకర్ వచ్చి మంటలను అదుపుచేయడానికి సహకరించింది. తాడేపల్లిగూడెం ఫైర్ ఆఫీసర్ టీవీ రామారావు, భీమడోలు ఫైర్ ఆఫీసర్ నాగరాజు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తెచ్చారు. సోమవారం విపరీతమైన ఎండ ఉండటంతో ఎగిసి పడిన మంటలను అదుపుచేయడానికి చాలా ఇబ్బంది పడ్డారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని అంచనా.

నేత్రపర్వం సువర్చలా హనుమద్ కల్యాణం


కల్యాణ అలంకరణలో సువర్చలా హనుమద్ వారు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో హనుమజ్జయంతి సహిత కల్యాణ మహోత్సవాలు సోమవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా అర్చకులు, వేద పండితులు సువర్చలా హనుమద్ కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి కల్యాణాన్ని వీక్షించారు. ఆదాయం రూ.1,10,370 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ చైర్మన్ సరిత, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

మద్దిలో నేడు

మద్దిక్షేత్రంలో జరుగుతున్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 16 మంగళవారం ఉపాలయంలో ఉన్న అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.

ఉపాధ్యాయుల బది‘లీలలు’

- సంఘ నాయకుల వ్యవహారంపై టీచర్ల అసంతృప్తి
- అందరికీ 5 ఏళ్ల బదిలీ విధానం తీసుకురావాలని విజ్ఞప్తి



సాక్షి, భీమవరం: ఉపాధ్యాయ బదిలీల్లో లబ్ధి పొందుతున్న ప్రధాన ఉపాధ్యాయ సంఘాల నాయకులపై తోటి సంఘ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీల్లో అందరికీ ఒకే విధానం వర్తించేలా 5 ఏళ్ల బదిలీ విధానాన్ని తీసుకొస్తున్న ప్రభుత్వ చర్యలను సమర్థిస్తున్న వారంతా.. తమ నాయకుల అగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. 1998 డీఎస్సీకి ముందు వరకు ఉపాధ్యాయుల బదిలీలు ప్రజాప్రతినిధుల చేతుల్లోనే ఉండేవి. ఆ తరువాత ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా ఉపాధ్యాయుల సీనియార్టీ, అనారోగ్య సమస్యలున్న ఉపాధ్యాయులు, టీచర్స్ యూనియన్ నాయకులకు కొన్ని ప్రాధాన్యత పాయింట్లతో మార్పులు చేశారు. ప్రధానోపాధ్యాయులకు లాంగ్ స్టాండింగ్ 5 ఏళ్లు, ఉపాధ్యాయులకు 8 ఏళ్లు పాఠశాలలో పనిచేసే పరిధితో బదిలీల కౌన్సెలింగ్ వ్యవస్థ ప్రారంభమైంది. ఉపాధ్యాయులు పని చేసే గ్రామాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించి కేటగిరీ–1గా నగరాలు, జిల్లా కేంద్రాలుగా ఉన్న పట్టణాల్లో హెచ్‌ఆర్‌ఏ 16 శాతం, కేటగిరీ–2లో మండల కేంద్ర పట్టణాల్లో హెచ్‌ఆర్‌ఏను 12 శాతం, కేటగిరీ–3లో పట్టణాలకు 8 కి.మీ దాటిన గ్రామాల్లో 10 శాతం హెచ్‌ఆర్‌ఏగా వర్గీకరించారు. దీని కారణంగా ఉపాధ్యాయులైన భార్యాభర్తలు, సంఘ నాయకులు ఎక్కువకాలం నగరాలు, పట్టణాలు, పరిసర ప్రాంతాల్లోని పాఠశాలలో పనిచేస్తూ ఆర్థికంగా, వ్యక్తిగతంగా లబ్ధి పొందుతున్నారు. ఏ విధమైన ప్రాధాన్యతలు లేని సామాన్య ఉపాధ్యాయులు తమ సర్వీస్ అంతా పట్టణాలకు 8 కిలోమీటర్ల దూరం దాటిన గ్రామాల్లో పనిచేస్తూ ఆర్థికంగా, ప్రయాణ భారంతో నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమ న్యాయం చేయాలి

ఇలాంటి తరుణంలో ప్రభుత్వం బదిలీల్లో లాంగ్ స్టాండింగ్ ఉపాధ్యాయులందరికీ 5 ఏళ్లుగా తీసుకోవాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తూ ఉపాధ్యాయులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు దీనిని వ్యతిరేకించి లాంగ్ స్టాండింగ్ 8 ఏళ్లు ఉండాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడాన్ని ఉపాధ్యాయులు జీర్ణించుకోలేకపోతున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలకు, విద్యాశాఖ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు లాంగ్ స్టాండింగ్ 5 ఏళ్లు ఉండగా అదే విద్యాశాఖలోని ఎస్‌జీటీ, ఎస్ఏలకు మాత్రమే 8 ఏళ్లు ఏంటని సామాన్య ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. సమాన అర్హతలు, జీతం, పని ఉన్నప్పుడు బదిలీల్లో అసమానతలు తొలగించి ఉపాధ్యాయులందరికీ సమ న్యాయం చేయాలని కోరుతున్నారు. గతంలో ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం 8, 16, 24 ఏళ్లుగా ఉండేదని దానిని 6, 12, 18గా కుదించారని బదిలీల లాంగ్ స్టాండింగ్‌కు మాత్రం 8 నుంచి 5 ఏళ్లకు ఎందుకు తగ్గించకూడదని సామాన్య ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి సరికాదు

కొంతమంది ఉపాధ్యాయులకు, నాయకులకు మాత్రమే మేలు చేకూరేలా ప్రభుత్వంపై యూనియన్ నాయకులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిస్వార్థంగా ఉపాధ్యాయుల శ్రేయస్సు కోరి 5 ఏళ్ల లాంగ్ స్టాండింగ్ బదిలీలు ఉండే విధంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని లేకుంటే ఉపాధ్యాయ సంఘాల్లో విభేదాలు ఏర్పడి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

వాసు దేవునికి సహస్రనామార్చనలు



శ్రీకృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని రామ చంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో సోమవారం వరూధిని వైశాఖ బహుళ ఏకాదశి పురస్కరించుకొని ఉదయం కృష్ణ పరమాత్మకు సహస్రనామార్చన,పంచామృతాలతో అభిషేకాలు, భగవద్గీత పారాయణంలు భక్తులు ఆధ్వర్యంలో జరిగాయి. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

ఈఏపీ సెట్‌కు 240 మంది హాజరు

తాడేపల్లిగూడెం: ఏపీ ఈఏపీసెట్ పరీక్షకు సోమవారం విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 245 మందికి గాను 240 మంది హాజరయ్యారు. సాయంత్రం జరిగిన పరీక్షకు 245 మందికి గాను 237 మంది హాజరయ్యారని పరీక్షా కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు. స్థానిక వాసవీ ఇంజనీరింగ్ కళాశాల్లో ఈ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు.

సామూహికంగా చిత్రగుప్తుని నోములు



గూడెంలో చిత్రగుప్తుని నోములు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైశాఖ బహుళ ఏకాదశి సోమవారం సందర్భంగా తాడేపల్లిగూడెం వాసవి కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపం వద్ద ఆర్యవైశ్య మహిళా జిల్లా సంఘం ఆధ్వర్యంలో సామూహికంగా చిత్రగుప్తుని నోములు నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు ఆలపాటి అచ్యుతలక్ష్మి మాట్లాడుతూ చేసే అన్ని నోములు, పుణ్య కార్యక్రమాలు చిత్రగుప్తుని ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. 30 మంది మహిళలు నోములు నోచుకొన్నారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్, వాసవి క్లబ్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సభ్యులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భగవద్గీత ప్రచారం చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: బంటుమిల్లిలో సోమవారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం చేశారు. సిద్ధాంత కర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి మనిషి భగవద్గీత చదివి జన్మను సార్థకం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, వాసుదేవా, సత్య నారాయణ, గోపీ, ప్రసాద్, మూర్తి, రాము, శ్రీకర్, సుందర్‌రావు, హనుమంతరావు, తారకేశ్వరి, భానుమతి, శ్రీరేఖ, యశోద, వేంకట లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు అభినందన



ఆర్టీసీ ఉద్యోగులను అభినందిస్తున్న వీరయ్య చౌదరి

భీమవరం (ప్రకాశం చౌక్): ఆర్టీసీ భీమవరం డిపో పరిధిలో ఏప్రిల్ నెలకు సంబంధించి ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిన వారిని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.వీరయ్య చౌదరి సోమవారం అభినందించారు. అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు టీటీ రావు, ఆర్‌ఆర్‌కే రాజు, అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు సీహెచ్‌వీవీఎస్ నారాయణ, సీహెచ్ కల్యాణ్, జేహెచ్‌ఎస్ ప్రసాద్‌లను ప్రశంసాపత్రాలు ఇచ్చి అభినందించారు. వీరికి రూ.500, రూ.400, రూ.300 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజ్ఞాన తరగతులు



వేసవి విజ్ఞాన తరగతులు బోధిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు



వేల్పూరు గ్రంథాలయంలో పుస్తకం పఠనం చేస్తున్న విద్యార్థులు



తణుకు మహిళా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ రీడర్స్ ఫోరం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణా తరగతులు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 8వ రోజు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థినీ విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులైన ప్రత్తి వీరాస్వామి, ఎస్.సాల్మన్‌రాజు, మహాశివభట్టు లక్ష్మణరాజు, ఎ.జనార్దనరావు, పీజీ స్టూడెంట్ వెంకటరమణ, పి.భాస్కరరావులు విద్యార్థులకు వివిధ అంశాలలో తెలుగు పాఠ్యాంశాలు, ఆటలు, సైన్స్, ఇంగ్లీషు గ్రామర్, నీతి పద్యాలు, హిందీ, లెక్కలు బోధించారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణా శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సోమవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదివించడం, పుస్తక సమీక్ష, ఇంగ్లీష్ పథాలను పూరించడం వంటి వాటిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, ఏ ధనరాజు తదితరులు పాల్గొన్నారు. తణుకు పట్టణంలోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులతో నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం, భగవద్గీత శ్లోకాలను నేర్పించడంతో పాటు మ్యూజికల్ చైర్స్, వివిధ ఆటలను ఆడించారు. ఈ కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిశాఖా గ్రంథాలయంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి

అత్తిలి: మండలంలోని అత్తిలి శాఖ గ్రంథాలయంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా కాటన్ చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గ్రంథాలయాధికారి డి కృష్ణారావు మాట్లాడుతూ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని అన్నారు. ఉపాధ్యాయుడు డేవిడ్‌రాజు కాటన్ జీవితచరిత్ర, విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం అమర్ ఆర్ట్స్ అకాడమి నిర్వాహకులు అమర్ విద్యార్థులకు పాట్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు లైబ్రేరియన్ గంధం శేషవేంద్రరావు, ఎ బాలాజీ, సీహెచ్ విజయ కుమార్, ఎం శ్రీదేవి, వి లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

500 హెక్టార్లలో బిందు సేద్యం లక్ష్యం



పి.వీరభద్రరావు

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను 500 హెక్టార్లలో బిందు, సూక్ష్మ సేద్యం లక్ష్యంగా నిర్దేశించినట్లు ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీరభద్రరావు తెలిపారు. సోమవారం తాడేపల్లిగూడెంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదెకరాల లోపు సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఐదెకరాలు పైబడిన రైతులకు 50 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేస్తామన్నారు. పరికరాల కోసం రైతులు తమ ఆధార్ కార్డు, భూమి యాజమాన్య హక్కు పత్రం, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో సమీపంలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల రైతులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

స్పందన కార్యక్రమానికి నాలుగు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు అర్జీలు అందాయని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్ తెలిపారు. రెవెన్యూకు మూడు, విద్యుత్ శాఖకు ఒకటి చొప్పున అర్జీలు అందాయన్నారు. అర్జీల పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖలకు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వైకే వీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పని ప్రాంతంలో సౌకర్యాలు పునరుద్ధరించాలి



కడియద్ద గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పని ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చినతాడేపల్లి, కడియద్ద గ్రామంలోని ఉపాధి పని ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమరాజు మాట్లాడుతూ పని ప్రదేశంలో పనిముట్లు, మెడికల్ కిట్లు, మంచినీరు, మజ్జిగ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. లేని పక్షంలో పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డొక్కా వెంకటేశులు, శీలి రాణి, దూలపల్లి నాగమణి, దూలపల్లి వెంకటరత్నం, సీహెచ్.రాజేష్, యాతం నాగేశ్వరరావు, గంగిరెడ్డి బాపిరాజు, గట్టు నరసారావు, అడబాల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించాలి



బహుజన సేన సమితి సమావేశంలో నినాదాలు చేస్తున్న సమితి సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించాలని బహుజన సేన సమితి జిల్లా అధ్యక్షుడు చీలి మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలోని బహుజన సేన జిల్లా కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీలి మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ మహిళలపై జరుగుతున్న దాడులను పూర్తి స్థాయిలో అరికట్టాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం చేయాలని, నిందితులకు శిక్ష పడేలా పోలీసు యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బహుజన సేన సమితి మండల అధ్యక్షుడు ఉండ్రాజవరపు కృష్ణ, ఉపాధ్యక్షుడు జంపెల్లి సుధాకర్, మండల సలహాదారులు చీలి బాబూజీరావు, పెదతాడేపల్లి గ్రామ ఉపాధ్యక్షుడు శివుని కొండలు, కార్యదర్శి చీలి పోలు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ అన్నారు. కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డును పటిష్టం చేయాలని, కార్మికుల సమస్యలను పట్టించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలూరి లక్ష్మణరావు, పడాల శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణ, తాడికొండ శ్రీనివాసరావు, ఓసూరి వీర్రాజు, కళింగ లక్ష్మణరావు, మెండెం జేమ్స్, రాజా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

నరసాపురం: స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ నుంచి మొత్తం 64 ఫిర్యాదులు అందినట్టు సబ్‌కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుల పరిష్కారం అంశానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. స్పందన దరఖాస్తుల అంశంపై తనకు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

నెత్తిన నిప్పుల కుంపటి

- తారాస్థాయిలో ఉష్ణోగ్రతలు
- భానుడి ప్రతాపంతో జనం విలవిల
- ఎండల దాటికి రోడ్లన్నీ నిర్మానుష్యం
- ఉక్కపోత, వడగాడ్పులతో అవస్థలు



నిర్మానుష్యంగా తణుకులోని ప్రధాన కూడలి



గూడెంలో పండ్ల రసాలు తాగుతూ సేదదీరుతున్న యువత, చిన్నారులు

తణుకు, పెంటపాడు: భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. నిప్పుల వాన కురిసినట్లుగా ఎండలు మండిపోవడంతో జనం హడలెత్తిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే విపరీతమైన ఎండ, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గరిష్టంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో మధ్యాహ్నం 12 గంటలయ్యేసరికి రోడ్లు మొత్తం నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, కూడళ్లు జనం లేక వెలవెలబోయాయి.

జనం అవస్థలు..

గత కొద్ది రోజులుగా ఎండ తీవ్ర భయంకరంగా పెరగడంతో ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండటంతో ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. ఒకపక్క వేసవి తీవ్రత, వడగాడ్పులతో వేడి గాలలు వీస్తున్నాయి. ఇంట్లో ఉన్న ఫ్యాన్ గాలి వేడిగా తగులుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బయటకు వస్తే వీస్తున్న వేడిగాలులకు శరీరంలో మంట పుడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రెండు వారాలు పాటు ఈ ఎండలను ఎలా భరించాలో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 8 గంటలకు కూడా వడగాడ్పులు వీస్తున్నాయని వాటిని భరించలేక పోతున్నామని మహిళలు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయటకు రాకపోవడమే మేలు...

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వాతావరణం కాస్త చల్లబడినా నాలుగు రోజులుగా ఎండ తీవ్రత తారాస్థాయికి చేరుకుంది. వివాహాలకు, ఇతర పనుల నిమిత్తం తప్పనిసరిగా వెళ్లాల్సిన వారు ముఖాలకు ముసుగేసుకుని, చెవులకు జేబురుమాళ్లు కట్టుకుని వెళుతున్నారు. వడగాడ్పుల కారణంగా ప్రయాణాలు మానుకుని ఇంటికే పరిమితమవుతున్నారు. మధ్యాహ్నం 11 గంటలకు గ్రామాలు సైతం నిర్మానుష్యంగా మారి, కర్ఫ్యూను తలపిస్తున్నాయి. ఎండ తీవ్రత తగ్గే వరకు బయటకు రాకపోవడమే మేలని మరోవైపు వైద్యులు సూచిస్తున్నారు.

భక్తాంజనేయస్వామికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో భక్తాంజనేయస్వామివారు

పాలకోడేరు: పెన్నాడలోని భక్తాంజనేయ స్వామీ దేవాలయం వద్ద సోమవారం హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం భక్తులు పండ్ల రసాలతో అభిషేకం చేశారు. అరటిపండ్లతో సహస్రనామ పూజ జరిగింది. సాయంత్రం భగవన్నామ సంకీర్తన జరిగింది. మంగళవారం తేనెతో అభిషేకం, లక్షపత్రి పూజ, తులసి పూజ, అన్నసమారాధన నిర్వహిస్తామని ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా దేశాలమ్మ జాతర ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లాకు సెంటర్ చింతలతోటలో కొలువై ఉన్న దేశాలమ్మ జాతర మహోత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సంవత్సరం అమ్మవారి ఉత్సవాలు 51వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం నుంచి 21వ తేదీ ఆదివారం వరకూ వారం రోజులు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. లాకు సెంటర్ నుంచి రైల్వే గేటు వరకూ విద్యుద్దీపాలంకరణ, అమ్మవారి చిత్రాలతో బారికేడ్లతో విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి 12 స్టేజీలపై 12 గ్రూపుల కళాకారుల ప్రదర్శనతో అమ్మవారి జాతర ప్రదర్శన నిర్వహించారు. రాత్రి 1 గంట సమయంలో బాణసంచా కాల్చారు. మంగళవారం అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ వారం రోజులు అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తామని అర్చకులు తెలిపారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి శిడగం సురేంద్ర, కార్యదర్శి గంధం లక్ష్మీనారాయణ, కోశాధికారి అయినాల సత్యసూర్య వరప్రసాద్, అమ్మవారి ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా పట్టణ వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, శిడగం రామలింగేశ్వరరావు, గొలగాని రమేష్, కొల్లి కొండ ప్రసాద్ తదితరులు ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

జోరుగా ఉపాధి హామీ పనులు

కాళ్ల: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. సోమవారం అమృత్ సరోవర్‌లో భాగంగా గ్రామంలోని పద్మావతి మంచినీటి చెరువులో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. పనులను గ్రామ సర్పంచ్ సాదు శ్రీదేవి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పనులు అంచనా రూ.10లక్షల 30 వేలతో రెండున్నర ఎకరాల్లో 3,713 పనిదినాలు పనిచేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాదు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాటన్‌దొర సేవలు చిరస్మరణీయం



పెంటపాడులో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఇరగవరంలో కాటన్ దొర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెంటపాడు: ఉభయగోదావరి జిల్లాలకు సాగు, తాగునీటికి రూపకర్త కాటన్ దొర సేవలు నిరంతరం చిరస్మరణీయమని, పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగ సమాఖ్య ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో కాటన్ దొర జయంతి పురస్కరించుకొని పెంటపాడులో కాటన్‌క్లబ్ ఆధ్వర్యంలో పలువురు సోమవారం వీణం వీరన్న రైతు క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గ్రామంలోని ఊరచెరువు గట్టున ఉన్న కాటన్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ వ్యవసాయం సస్యశ్యామలం చేసేందుకు కాటన్‌దొర ప్రాజెక్టులు నిర్మించారన్నారు. తద్వారా డెల్టాకు సాగునీటితో పాటు, తాగునీరు అందించేందుకు కాటన్ సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, కర్రి వరహాలరెడ్డి, కళింగ లక్ష్మణరావు, బండారు శ్రీను, వైఎస్సార్ మండల యూత్ అధ్యక్షుడు బాస్కరరెడి, గ్రామసర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, దాసరి నరేష్, వైఎస్సార్ సీపీ నాయకులు నాయకులు జామి కృష్ణ, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, నల్లమిల్లి ప్రభాకరరెడ్డి, దేవాబత్తుల బాబి, రెడ్డి కృష్ణ, సత్తి ముత్యప్రసాద్‌రెడ్డి, పలు గ్రామాల వైసీపీ నాయకులు రైతులు అధికారులు పాల్గొన్నారు. జట్లపాలెం గ్రామంలోని మిడ్‌లెవిల్ కాలువ గట్టున ఉన్న కాటన్ విగ్రహం వద్ద విగ్రహదాతలైన వల్లేపల్లి కుటుంబీకుల ఆధ్వర్యంలో కాటన్ జయంతి వేడుకలు జరిగాయి.

ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో :

పెంటపాడు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో కాటన్‌విగ్రహానికి సెక్షన్ ఏఈ సిబ్బంది ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిబ్బంది, లస్కర్లుసంఘ నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. విప్పర్రు గ్రామంలో స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి సొసైటీ అధ్యక్షుడు కళిరెడ్డి అబ్బాయి, కార్యదర్శి సత్యనారాయణమూర్తితో పాటు, పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు. అలంపురం, మీనవల్లూరు, చింతపల్లి, పరిమెళ్ల తదితర గ్రామాల్లో కాటన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

ఘనంగా కాటన్ జయంతి వేడుకలు

ఇరగవరం: మండలంలోని ఇరగవరం గ్రామంలో సోమవారం ఆర్థర్ కాటన్ దొర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సొసైటి అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్ కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి డెల్టాను సస్యశ్యామలం చేసిన కాటన్ దొర సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఉమ్మడి జిల్లాల ప్రజలు, రైతులకు అపర భగీరథుడయ్యారన్నారు. ఆయన సేవలకు చిహ్నంగా గోదావరి డెల్టాలోని కాల్వ వెంబడి గ్రామాల్లో వేలాదిగా కాటన్ విగ్రహాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎంపీటీసీలు పాల పాలేశ్వరరావు, మంగెన రామానాయుడు, విగ్రహ దాత ఎం.సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.